లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, మే 21: రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టర్‌రేట్‌లో తన చాంబర్‌లో రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక పురోగతిపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. రాజీవ్ యువ వికాసం కింద నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు వనపర్తి జిల్లాకు మొత్తం రూ.126.34కోట్లు సబ్సిడీ రూపంలో మంజూరు కాగా 28,110 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో వనపర్తి నియోజకవర్గానికి రూ.72.03 కోట్లు మంజూరు కాగా 15,388 దరఖాస్తులు వచ్చాయన్నారు. మక్తల్ నియోజకవర్గానికి రూ.14కోట్లు మంజూరు కాగా 3,114 దరఖాస్తులు వచ్చాయని, దేవరకద్ర నియోజకవర్గానికి రూ.9.24కోట్లు మంజూరు కాగా 4,334 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా కొల్లాపూర్ నియోజకవర్గానికి రూ.22.19కోట్లు మంజూరు కాగా 5,274 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖలకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా తనిఖీ చేసి అర్హులైన లబ్ధిదారుల ఎంపిక మే చివరి నాటికి పూర్తిచేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ యాదయ్య, డీఆర్‌డీవో ఉమాదేవి, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిరా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్, మైనార్టీ కార్పొరేషన్ అధికారి అఫ్జలుద్దీన్ పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియానికి రూ.కోటీ 80 లక్షలు మంజూరు

- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి వెల్లడి



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

అమరచింత, మే 21: గ్రామీణస్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి వెల్లడించారు. బుధవారం ఆయన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి ఆత్మకూర్, అమరచింత పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆత్మకూర్ పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.కోటి 80 లక్షల నిధులను మంజూరు చేస్తున్నట్లుగా వెల్లడించారు. అమరచింత, ఆత్మకూర్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఉన్న క్రీడాకారులకు ఇక్కడ నిర్మించే ఇండోర్ స్టేడియంలో సాధన చేసి తమ ప్రతిభను మరింత మెరుగు పర్చుకొని జాతీయస్థాయిలో పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు రహిమతూల్ల, పరమేశ్, శ్రీనివాసులు, తులసిరాజు, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, గంగాధర్‌గౌడ్, ఎస్టీడీ శ్రీనివాసులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

అమరచింత, మే 21: ఆత్మకూర్, అమరచింత మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతూబ్ ఆరోపించారు. బుధవారం ఆయన ఆత్మకూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను స్థానిక ఏఐవైఎఫ్ నాయకులతో కలిసి పరిశీలించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు చేసి ఏడాదిన్నర దాటినా ఇప్పటివరకు సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని విమర్శించారు. త్వరలోనే నూతన విద్యా సంవత్సరం మొదలు కానుందని ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లోని గదులకు తలుపులు, కిటికీలు, మరుగుదొడ్లకు తలుపులు విరిగిపోయి గతంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, వేసవి సెలవులు ముగుస్తున్నా వాటికి మరమ్మతులు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలల పున: ప్రారంభానికి ముందే మౌలిక వసతలను ఏర్పాటు చేయడంతోపాటు విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్స్ తోపాటు పాఠ్యపుస్తకాలను అందజేయాలని, లేకపోతే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. ఆయనపాటు స్థానిక నాయకులు రవి, మహిమూద్, సమీర్, ఇమ్రాన్ ఉన్నారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునదేమనగా నా క్లయింట్ జాజుల మారుతి భర్త బందరు హర్షవర్ధన్ గారు శ్రీమతి రాకసి పద్మమ్మ భర్త రాకసి వేంకట రెడ్డి నుండి వనపర్తి టౌన్, మరియు మున్సిపాలిటి మరియు వనపర్తి మండలం మరియు జిల్లా వద్ద గల సర్వే నెం. 1125లో 89.693 చ.అ.కు సమానమైన 108 చ.గజాలు విస్తీర్ణం ప్లాట్ నెం.2/బి యావత్తును కొనుగోలు చేయదలిచారు. శ్రీమతి రాకసి పద్మమ్మ పైన తెలిపిన ఆస్తికి సంబంధించి డాక్యుమెంట్ నెం.2425/1982 కలిగిన గత టైటిల్ డీడ్ పోయినదని తెలియజేశారు.
పైన తెలిపిన సదరు డాక్యుమెంట్ పోయినందున ఎవరితోను ఏవిధమైన లావాదేవీ కుదుర్చుకోరాదని లేదా నిర్వహించరాదని సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైన ది. ఎవరికైనా సదరు డాక్యుమెంట్స్ దొరికినచో దిగువ సంతకందారును 7 రోజులలోగా సంప్రదించండి మరియు దానిని తిరిగి అప్పగించ గలరు. ఎవరేని వ్యక్తి(లు)/బ్యాంకులు/ఆర్థిక సంస్థలు పైన తెలిపిన ఆస్తికి సంబంధించి ఏదేని అభ్యంతరం, క్లెయిం, హక్కు, ప్రయోజనం, వివాదం కలిగి ఉన్నచో అతని/ఆమె/వారి అభ్యం తరం, క్లెయిం, హక్కు, ప్రయోజనం, వివాదాల వివరాలను నిరూపించుటకు డాక్యుమెంటరీ రుజువుతో దిగువ సంతకందారును సంప్రదించ వచ్చును. లేనిచో నా క్లయింట్ ఎవరికీ ఏవిధమైన అభ్యంతరాలు/క్లెయింలు/వివాదాలు లేవని భావించును మరియు నా క్లయింట్ పైన తెలిపిన ఆస్తి కొనుగోలుతో ముందుకు సాగుతారు మరియు ఆతరువాత ఎలాంటి క్లెయిం/అభ్యంతరం అనుమతించబడదు.
సం/- ఎన్.వేణుగోపాల క్రిష్ణ
ఎం.డి.అహ్మద్ (ఇమ్‌తియాజ్) అడ్వకేట్స్
ఇం.నెం.45-8/A, KDR నగర్, వనపర్తి-509103.
7036492449, 8074651577

విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలి

- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి టౌన్, మే 21 : సమాజంలో విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఉర్దూ మీడియం హైస్కూల్‌లో కొనసాగుతున్న జిల్లాస్థాయి ఉపాధ్యాయుల శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శక్తివంతమైనటువంటి నాయకత్వాన్ని విద్యార్థులకు అందించి వారిలో శాస్త్రీయ భావాలు, నీతి నిజాయితీతో కూడిన విలువలను ఉపాధ్యాయులు నేటి సమాజానికి అందించాలన్నారు. విద్యార్థులకు చిన్నప్పటి నుంచి థామస్ అల్వా ఎడిసన్, లూయిస్ పాశ్చర్, సోక్రటిస్, బ్రూనో, అబ్దుల్ కలాం, జగదీశ్ చంద్రబోస్ లాంటి శాస్త్రవేత్తల జీవిత చరిత్రలను అధ్యాయనం చేసి వారి నుంచి స్ఫూర్తి పొందేలా విద్యార్థులను తయారు చేయాలన్నారు. నేటి భారత శాస్త్ర సాంకేతిక రంగం అభివృద్ధి అయిందంటే డాక్టర్ అబ్దుల్ కలాం లాంటి వారి కృషి ఎంతో ఉందన్నారు. వనపర్తి జిల్లాలో విద్యాను బలోపేతం చేసి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి నాణ్యమైన విద్యను అందించి రాష్ట్ర స్థాయి ఫలితాలలో ఉత్తమ స్థానాన్ని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్స్ శ్రీనివాసులు, సుదర్శన్‌రావు, మల్లేశ్, సెంటర్ ఇన్‌చార్జి జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలి

వనపర్తి టౌన్, మే 21 : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే వనపర్తి జిల్లాలో బక్రీద్, హనుమాన్ జయంతి పండుగలను సోదరభావంతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. జూన్ 7వ తేదీన జరుగబోయే బక్రీద్, హనుమాన్ జయంతి పండుగల సందర్భంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో మత పెద్దలతో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బక్రీద్, హనుమాన్ జయంతి పండుగ పర్వదినాలను శాంతియుత వాతావరణంలో పరస్పరం మతాలను గౌరవించుకుంటూ జరుపుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పండుగలను ప్రతిఒక్కరూ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలంతా పండుగలను మత సామరస్యంతో నిర్వహించుకునేలా ఆయా మతాల పెద్దలు ప్రజల్లో సమన్వయం చేయాలన్నారు. ముఖ్యంగా సరిహద్దు రాష్ట్రాల మీదుగా వచ్చే పశువుల అక్రమ రవాణా కట్టడికి జిల్లా పరిధిలో పశు సంవర్ధక శాఖ సిబ్బందితో 3 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పశువుల రవాణా చేసే ప్రతి వాహనానికి తగు నిర్ధారిత ప్రమాణిక పత్రాలు ఉంటేనే పరిశీలించి అనుమతిస్తారని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పశువులు అక్రమ రవాణా జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకొని శాంతి భద్రతలకు విఘాతం కల్పించే పరిస్థితులు తీసుకురావద్దని సూచించారు.

ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

ముఖ్యంగా యువత ఆవేశంలో చేస్తున్న చిన్న తప్పులు శాంతి భద్రతల సమస్యలుగా తలెత్తే ప్రమాదం ఉంటుందని, అందుకని వివిధ వర్గాల మతపెద్దలు యువతకు సమన్వయం పాటించేలా దిశానిర్దేశం చేయాలన్నారు. ప్రధానంగా జిల్లాలో ఏ చిన్న ఘటన జరిగిన ఎడిటింగ్ చేసి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల ఐక్యతను సామరస్యానికి భంగం కలిగించేలా విద్వేషాలు రెచ్చగొట్టే, అసభ్యర పోస్టులు పెట్టడం తద్వారా శాంతి భద్రతల సమస్య సృష్టించే ప్రయత్నం చేస్తున్న వారిపై పోలీసు మీడియా మానిటరింగ్ సెల్ నిఘా పెట్టిందన్నారు. అదేవిధంగా సభలు, సమావేశాలు, ర్యాలీలకు ఖచ్చితంగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, తద్వారా అవసరమైన భద్రతను కల్పించేందుకు దోహదపడుతుందన్నారు. ఈద్గా వద్ద సామూహికంగా ప్రార్థన కోసం వచ్చే ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్, పార్కింగ్, పోలీస్ బందోబస్త్ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, డీసీఆర్బీ డీఎస్పీ ఉమా మహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు సీఐలు కృష్ణయ్య, నరేశ్, పశువైద్య శాఖ ఏడీ మీరజ్ అహ్మద్, వెటర్నరీ డాక్టర్ మల్లేశ్, జిల్లాలోని గోశాల నిర్వాహకులు, మత పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ఆధారిత బోధన

- జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి మహానంది

గోపాల్‌పేట , మే 21 : రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ఆధారిత బోధన ప్రారంభించనున్నట్లు జిల్లా విద్యా అకాడమి మానిటరింగ్ అధికారి మహానంది అన్నారు. బుధవారం గోపాల్‌పేట, ఏదుల, రేవల్లి మండలాలకు చెందిన ప్రాథమిక పాఠశాలల హెచ్ ఎంలు, ఉపాధ్యాయులకు గోపాల్‌పేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వృత్యాంతర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని, బోధనలో పద్ధతులను మార్చాలని అప్పుడే నాణ్యమైన విద్యను అం దించ గలమన్నారు. ఈ ఏడాది కేర ళ వారి సాఫ్ట్‌వేర్‌తో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోధన విధానాన్ని, డిజిటల్ విద్యా విధానాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. ఇక్కడ శిక్షణ పొందిన ప్రతి ఉపాధ్యాయుడు ఖచ్చితంగా అమలు చేస్తే విద్యార్థుల్లో మార్పు వచ్చి ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు నమ్మకం ఏర్పడుతుందన్నారు. వచ్చే నెల 6వ తేదీ నుంచి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా కృషి చేయాలన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న అకాడమిక్ మానిటరింగ్ అధికారి మహానంది

కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్, బాల్‌రెడ్డి, ఆర్పీలు, హెచ్ ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అమరచింత, మే 21: చికిత్స పొందుతూ యువకుడి మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి హైదరాబాద్ దవాఖానలో చోటుచేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం పాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సురేశ్(35) ఈ నెల 4 వ తేదీన రాత్రి నర్వ మండలంలోని గ్రామానికి బైక్‌పై వెళ్లి తిరుగు ప్రయాణంలో మండలంలోని ధర్మాపూర్ శివారులో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. బాటసారులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో స్థానిక దవాఖానలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లుగా కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయంపై బుధవారం అమరచింత ఎస్సై సురేశ్‌ను వివరణ కోరగా మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

మానవపాడు/అలంపూర్ చౌరస్తా, మే 21: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు రైల్వేపోలీసులు తెలిపారు. రైల్వ్ హేడ్ కానిస్టేబుల్ అశోక్ కథనం ప్రకారం పోతులపాడు, అలంపూర్ స్టేషన్ సమీపంలోని గుర్తుతెలియని వ్యక్తి సుమారు 50నుంచి 55 ఏండ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు ఎవరైనా ఉంటే 8712658206 నెంబరుకు సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

బాల్య వివాహాలపై అవగాహన

మద్దెలబండలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సురేశ్

మల్దకల్, మే 21 : మండలంలోని మద్దెలబండ గ్రామంలో బుధవారం బాల్యవివాహాలపై మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల పరిరక్షణ కౌన్సిలర్ సురేశ్ ఉపాధి కూలీలతో మాట్లాడుతూ బాలలందరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించి వారికి విజ్ఞానాన్ని అందించాలన్నారు. ముఖ్యంగా బాలలపై ఆగత్యాలు జరిగితే వెంటనే 1098కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై ఈశ్వరయ్య, అవుట్ రీచ్ వర్కర్ ప్రకాశ్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్ నాయక్, ఆశ కార్యకర్తలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్ తనిఖీ

మల్దకల్, మే 21 : మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు సమ్మర్ క్యాంపులను జీహెచ్ఎం సురేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. బుధవారం సమ్మర్ క్యాంపు ముగింపు సమావేశం సందర్భంగా డీఈవో అబ్దుల్ ఘని హాజరై మాట్లాడారు. సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు వినియోగించుకోవడం ఎం తో హర్షించ దగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సురేశ్ ఉపాధ్యాయులు జాకీర్ హుస్సేన్, లక్ష్మణ్,తిరుమలేశ్, రాజు, జయరాములు పాల్గొన్నారు.

మల్దకల్ పాఠశాలలో సమ్మర్ క్యాంపులో విద్యార్థులతో డీఈవో అబ్దుల్ ఘనీ

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, మే 21: జిల్లా కేంద్రంలోని కల్యాణ సాయి గార్డెన్స్‌లో బుధవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 503 మంది సీఎం సహాయనిధి, 201మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వనపర్తి, పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డు అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, ప్రమోదినిరెడ్డి, పీసీసీ సభ్యులు శంకర్‌ప్రసాద్, నాయకులు చీర్ల చందర్, ధనలక్ష్మి, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటా..

- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట, మే 21 : కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త వినోద్ మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం కొత్తకోట వెళ్లి వినోద్ పార్థివదేహం పై పూలమాల వేసి నివాళులర్పించారు. వినోద్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వినోద్ మృతి చెందడం పార్టీకి తీరని లోటని అన్నారు. పార్టీకోసం నిస్వార్థంగా పనిచేసే ప్రతి కార్యకర్త తన కుటుంబ సభ్యులేనని, వారికి ఏకష్టం వచ్చినా తోడుగా ఉంటానన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, మాజీ ఎంపీపీ గుంత మౌనిక, మాజీ సీడీసీ చైర్మన్ చెన్నకేశ్వరెడ్డి, సీనీయర్ నాయకులు గాడిల ప్రశాంత్, అయ్యన్న, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కరాటేలో నైపుణ్యం సాధించాలి

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, మే 21 : కొత్తకోట పట్టణంలో గాడ్స్ ఆన్ వారియర్స్ షోటో ఖాన్ కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులకు బ్లాక్‌బెల్ట్ సర్టిఫికెట్లను బుధవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అందజేశారు. క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీని శాలువాతో ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారులు బాల్యం నుంచే కరాటే నేర్చుకొని దానిలో నైపుణ్యం సాధించాలని పేర్కొన్నారు. శిక్షణ ఇచ్చిన మాస్టర్స్ హరీశ్‌యాదవ్, ఎండీ. ఇంతియాజ్‌లను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, కరాటే మాస్టర్స్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కళా రంగాల్లోనూ రాణించాలి

గద్వాలటౌన్, మే 21 : విద్యతోపాటు క్రీడలు, కళా రంగాల్లోను విద్యార్థులు రాణించి ప్రతిభను చాటాల్సిన అవసరం ఉందని ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్‌ఘని సూచించారు. గద్వాల లోని కేజీబీవీలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ బుధవారంతో ముగిసింది. ముగింపునకు ఆయన ముఖ్య అతిథిగా హాజ రయ్యారు. అంతకుముందు విద్యార్థులు తాము నేర్చుకున్న కళా ప్రదర్శనను ప్రదర్శించారు. చిత్రలేఖనంలో వారి ప్రతిభను కనబర్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక శిక్షణలో విద్యార్థులు రాణించడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి నచ్చిన రంగాన్ని ఎంచుకొని ప్రతిభ కనబర్చినప్పుడే జీవితంలో రాణిస్తారని చెప్పారు. అలాగే ప్రతి ఒక్కరికీ లక్ష్యం ఉండాలని లక్ష్యాన్ని చేరుకునే వరకు కృషి చేయాలని అప్పుడే సమాజంలో గుర్తింపు వస్తుందని సూచించారు. అనంతరం విద్యార్థులకు ప్రోత్సహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీసీడీవో ఫర్జాన బేగం, ప్రత్యేకాధికారి శ్రీదేవి, డీఎల్ఎంటీ రామాంజనేయులు, ఆర్పీలు పుష్పలత, చంద్రకళ, దివ్య, నాగలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న డీఈవో

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

అయిజ, మే 21: మండలంలోని పులికల్, ఉప్పల గ్రామాల్లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తాసీల్దార్ ప్రశాంత్‌గౌడ్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తూకం వేసిన ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కార్యక్రమం లో సివిల్ సప్లయ్ అధికారి ఉదయ్ పాల్గొన్నారు.

కార్టూనిస్ట్‌కు సన్మానం

వనపర్తి టౌన్, మే 21 : కార్టూనిస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్యశ్రీభారతి, హాస్యానందం మాస పత్రిక సంయుక్తంగా నిర్వహించిన కార్టూన్ పోటీల్లో వనపర్తి చెందిన కొండకింది శేషిరెడ్డి విశిష్ట బహుమతి సాధించారు. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో సీని హాస్యనటుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్, హాస్యనటులు, మాటల రచయిత తనికెళ్ల భరణి చేతులమీదుగా శేషిరెడ్డి ప్రశంసాపత్రం, నగదు బహుమతిని అందుకున్నాడు. ఈ సందర్భంగా సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో శేషిరెడ్డికి బుధవారం పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సాహితీ కళావేదిక సభ్యులు బైరోజు చంద్రశేఖర్, బండారు శ్రీనివాసులు, డాక్టర్ శ్యాందసుందర్, ఉపాధ్యాయుల శేక్యానాయక్, విజయభాస్కర్‌రెడ్డి, బైద్దారెడ్డి, రాములు, కురుమూర్తి, బక్కయ్య, రవీందర్ ఉన్నారు.

కంటి శిబిరం విజయవంతం

అయిజ, మే 22: మండలంలోని ఉత్తనూరులో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. శంకర కంటి దవాఖాన భవిష్యత్ భారత్, ఎస్‌బీఐ ఫౌండేషన్ సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో కంటి పరీక్షలకు 78మంది హాజరు కాగా 13మందికి కంటి పరీక్షలు చేసేందుకు రెఫర్ చేసినట్టు కో-ఆర్డినేటర్ నర్సింహులు తెలిపారు. మరో 22మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది యశోద, అరుణ, రాము పాల్గొన్నారు.

బెస్ట్ అవైలెబుల్ పాఠశాలలకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, మే 21: బెస్ట్ అవైలెబుల్ స్కూల్ పథకం కింద అత్యున్నత ప్రమాణాలు కలిగి ఉన్న పాఠశాలలను ఎంపిక చేసి జిల్లాలోని ఎస్సీ విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించేందుకు గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ అనుమతి కలిగి ఉన్న ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఎస్సీ విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించడానికి ప్రభుత్వం అనుమతించినట్లు చెప్పారు. ప్రతి డే స్కాలర్ విద్యార్థికి రూ.28వేలు, ప్రతి హాస్టల్ విద్యార్థికి రూ.42వేలు మించకుండా ట్యూషన్ ఫీజు మంజూరు చేస్తారని తెలిపారు. ప్రైవేట్ విద్యా సంస్థలు తమ దరఖాస్తులు , నిర్ణీత ప్రోఫార్మాలో పొందుపరిచి ఈ నెల 25లోగా జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలని కలెక్టర్ తెలిపారు. వివరాలకు 9949471046 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

జయంతి వేడుకలు జయప్రదం చేయాలి

దళిత వైతాళికుడు, ఆది ఆంధ్ర సభ స్థాపకుడు, సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతిని జయప్రదం చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి బుధవారం ప్రకటనలో కోరారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు భా